క్లుప్తంగా

సూర్యాపేటకు చేరిన సైకిల్‌యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న బొడ్డు ప్రవీణ్

భానుపురి : ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రెండోసారి సీఎం కావాలని కోరుతూ జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లింగంపల్లికి చెందిన బొడ్డు ప్రవీణ్ చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ జనగామ నుంచి తాడేపల్లిగూడెం వరకు ఈ సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

ఏఎస్ఐ శ్రీరాములుకు సన్మానం



ఏఎస్ఐ శ్రీరాములును సన్మానిస్తున్న మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సంపత్ శ్రీరాములుకు ఏఎస్ఐగా ప్రమోషన్ వచ్చింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం కోశాధికారి చింత జాన్‌విలన్ ఆధ్వర్యంలో శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జాన్‌విలన్ మాట్లాడుతూ నిజాయతీగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని, భవిష్యత్‌లో ఉన్నత పదవులు స్వీకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటరత్నం, బచ్చలకూరి జానయ్య, నర్సయ్య, దైద వెంకన్న, లింగయ్య, వెంకన్న, సుమన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధుకు దరఖాస్తుల ఆహ్వానం

అర్వపల్లి : నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రావి శశిధర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులందరు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. అలాగే ఈ నెల 28 వరకు పాస్‌పుస్తకాలు పొందినా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్ జీరాక్స్ ప్రతులను రైతు వేదికల్లో ఏఈఓలకు అందజేయాలని కోరారు.

కనీస వేతన జీఓ అమలు చేయాలి



మాట్లాడుతున్న ముత్యాలు

కోదాడఅర్బన్ : మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతన జీఓను అమలు చేసి నెలకు రూ.25వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మిట్టగడుపుల ముత్యాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం శ్రీదేవా స్వచ్ఛంద సేవా సంస్థ అనే కొత్త సంస్థను తీసుకొచ్చి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. గత 20 సంవత్సరాలుగా పోరాటం చేసి స్వచ్ఛంద సేవా సంస్థలను వెనక్కు తరిమినా మళ్లి వాటిని ముందుకు తీసుకొచ్చి కార్మికులపై రుద్దడం తీవ్రమైన చర్య అన్నారు. పాఠశాలల్లో వంటశాలలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గురజాల తిరపతమ్మ, సుంకర అన్నపూర్ణమ్మ, రామానుజమ్మ, నాగలక్ష్మి, రమణ, పద్మ, సుజాత, సైదమ్మ, బుజ్జి పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

నూతనకల్ : కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్ఎస్‌యూఐ సమావేశంలో మాట్లాడారు. జూలై 2వరకు ప్రతి గ్రామంలో ఎన్ఎస్‌యూఐ కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లెం కృష్ణారెడ్డి, ఎన్ఎస్‌యూఐ మండల ఇన్‌చార్జ్ ప్రవీణ్ కుమార్, అశోక్ పాల్గొన్నారు.

జూలైలో చలో హైదరాబాద్

నూతనకల్ : ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధనకై జూలై మూడవ వారంలో నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాల్వాయి బాలయ్య కోరారు. శనివారం వెంకెపల్లిలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బహిరంగ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కందుకూరి శ్రీను, పాల్వాయి పరశురాములు, కొండగట్టు శ్రీను, రాంపాక సత్యం, రాంపాక విజయ్, మూరగుండ్ల వీరన్న, పాల్వాయి నాగరాజు, బాకీ వెంకన్న పాల్గొన్నారు.

తీరనున్న లోలెవల్ కష్టాలు

- నశీంపేట శివారులో వంతెన నిర్మాణానికి మోక్షం
- రూ.3కోట్ల 60 లక్షల వ్యయంతో కొనసాగుతున్న పనులు



కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు



లోలెవల్ బ్రిడ్జిపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహనాలు (ఫైల్)

ఆత్మకూర్(ఎస్) : మండలవాసులకు లోలెవల్ కష్టాలు తీరనున్నాయి. చివ్వెంల– ముకుందాపురం రహదారిపై నశీంపేట గ్రామ సమీపంలో ఈ లోలెవల్ వంతెన కారణంగా మండలవాసులే కాకుండా నూతనకల్, చివ్వెంల మండలాలకు చెందిన వాహనదారులు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలం వచ్చిందంటే ప్రయాణికులు ఈ దారిలో వెళ్లాలంటేనే భయపడుతున్నారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని చాలాకాలంగా ప్రజలు కోరుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రజల కష్టాలను తీర్చేందుకుగాను ప్రభుత్వం వంతెన నిర్మాణ పనులకు అనుమతులివ్వగా.. పనులు శరవేగంగా సాగుతున్నాయి.

ఆదమరిస్తే ప్రమాదమే..

నశీంపేట శివారులో ఈ వంతెనపై ప్రయాణం చేసేటప్పుడు ఆదమరిస్తే ప్రమాదానికి గురికావాల్సిందే. ప్రధానంగా వర్షాకాలంలో ఏ సమయంలో ఏ విధంగా వరద ప్రవాహం ఉంటుందో అంచనా వేయడం కష్టంగా మారుతోంది. ఈ వంతెన వద్దకు గొలుసుకట్టు చెరువులైన పాతసూర్యాపేట, ఏనుబాముల, గట్టికల్, ఆత్మకూరు పెద్దచెరువు, మద్రికుంట, భీమునికుంటల అలుగు నీరు వస్తోంది. ఆరేళ్లుగా భారీ వర్షాలు కురుస్తుండడం.. ఇదే సమయానికి ఎస్సారెస్పీ కాలువల ద్వారా గోదావరి జలాలతో అప్పటికే చెరువులు నిండుకుండల్లా ఉండడంతో వచ్చిన వరద వచ్చినట్లుగా ఈ వంతెన పైనుంచి పోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏటా ఏదో ఒక ప్రమాదం ఈ లోలెవల్ బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంటూనే ఉంటుంది. ఓ కోళ్ల వాహనం, కారు వాగులోకి కొట్టుకుపోగా.. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు కొకొల్లలుగా ఉన్నాయి. ఇక గతేడాది విద్యార్థులతో వెళ్తున్న ఓ స్కూల్ వాహనం వరదలో చిక్కుకుని తృటితో ప్రమాదం నుంచి బయటపడింది.

రూ.3.60 కోట్లతో పనులు..

చివ్వెంల – ముకుందాపురం వరకు ఉన్న ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రహదారితో ఆత్మకూరు, నూతనకల్, చివ్వెంల మండలాల ప్రజలకు రవాణా సదుపాయం సులువు కావడమే కాకుండా జిల్లా నుంచి మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు వెళ్లే వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ వర్షాకాలంలో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం రూ.3.60 కోట్లతో లోలెవల్ బ్రిడ్జి స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు అనుమతులు ఇవ్వగా కొంతకాలంగా ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పాత బ్రిడ్జిని తొలగించి వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా డైవర్షన్ రోడ్డును నిర్మించారు. వంతెన కోసం బెడ్ పోసి పిల్లర్ల నిర్మాణం చేపడుతున్నారు. నూతన వంతెన నిర్మాణంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

హైలెవల్ బ్రిడ్జి నిర్మించడం సంతోషకరం



వర్షం వచ్చిందంటే వాగుపై వరద ఉధృతంగా పారేది. రాత్రి సమయాల్లో పలువురు వాహణదారులు ప్రమాదాలకు గురయ్యారు. కొన్ని వాహనాలు వరదలో కొట్టుకుపోగా స్థానికులు కాపాడారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మించడం సంతోషంగా ఉంది. వెంటనే పూర్తిచేయాలి.

– దంతూరి సోమన్న

పనులు త్వరగా పూర్తిచేయాలి



వరదల సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వచ్చేది. వివిధ పనుల మీద మండల కేంద్రానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రజల ఇబ్బందులను గుర్తించి మంత్రి బ్రిడ్జి మంజూరు చేయించి నిర్మాణాలు ప్రారంభించడం సంతోషంగా ఉంది. త్వరితగతిన పనులు పూర్తిచేసి ఈ సంవత్సరమే ప్రారంభిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– ఏనిగ మల్లారెడ్డి

కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే అభివృద్ధి



కుక్కడంలో ఉపాధి కూలీలకు ప్రచార కరపత్రాలు అందజేస్తున్న బొమ్మెర వెంకన్న

మద్దిరాల : కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బీజేపీ మండల నాయకుడు బొమ్మెర వెంకన్న అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు మేరకు కుక్కడం గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఎలాంటి నిధులు ఇవ్వడం లేదని అన్నారు. ఉపాధిహామీ, సీసీరోడ్ల నిర్మాణం, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్ల ఏర్పాటు ఇలా ప్రతి పథకం కేంద్ర ప్రభుత్వం పెట్టిందేనని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జలగం అచ్చయ్యగౌడ్, బీసు పెద్ద వీరన్న, బీసు చిన్న వీరన్న, పులుగుజ్జ మహేందర్, రాంమూర్తి, రాంబాబు, ప్రభార్, పాల్గొన్నారు.

తిమ్మాపురం పాల సంఘం చైర్మన్‌గా వేణుధర్‌రెడ్డి



వేణుధర్‌రెడ్డికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్

అర్వపల్లి : తిమ్మాపురం పాలఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకారసంఘం (మదర్ డెయిరీ) చైర్మన్‌గా గ్రామానికి చెందిన చెల్లా వేణుధర్‌రెడ్డి ఐదోసారి ఏకగ్రీవంగా శనివారం ఎన్నికయ్యారు. గ్రామంలోని పాలఉత్పత్తిదారుల సంఘం భవనంలో ఎన్నికను నిర్వహించారు. డైరెక్టర్లుగా మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, పటేల్ సుందర్‌రెడ్డి, బి.శ్రీను, కె.లచ్చమ్మ, ఎం.మంగమ్మ, కోఆప్షన్ సభ్యులుగా సీహెచ్. మారయ్య, ఎం.మమత, ఎన్.సాలయ్య ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ హాజరై వేణుధర్‌రెడ్డికి ఎన్నిక ధ్రువపత్రాన్ని అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కె.దశరథరామారావు, జీడి మహేష్, కందుల చినతిరుమల్‌రావు, కె.కరుణాకర్‌రెడ్డి, మంగదుడ్ల మల్లయ్య, సదానందరావు, కె.నర్సయ్య, వెంకన్న, కాంతారావు, భిక్షం, కనకయ్య, కొండల్, సోమయ్య, నర్సయ్య, మధు, వెంకటేష్, రవి, మల్లేష్, బ్రహ్మచారి, వీరేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



అర్వపల్లిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

అర్వపల్లి : హుజూరాబాద్‌లో ముదిరాజ్ కులానికి చెందిన జర్నలిస్టును కిడ్నాప్‌చేసి దాడికి పాల్పడి కులం పేరుతో దూషించిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిపై చర్య తీసుకోవాలని కోరుతూ శనివారం అర్వపల్లిలో ముదిరాజ్ మహాసభ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సాయిని మధు, జిన్నె అశ్విన్, కోటిప్రసాద్, సతీష్, అంకిరెడ్డి శ్రీను, మనోహర్, కనుకు మహేష్, ఎం.రాజు, చింతల సైదులు, శేషు, గణేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు క్షమాపణ చెప్పాలి

తుంగతుర్తి : ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి జర్నలిస్ట్ అజయ్‌ని కిడ్నాప్ చేయడంతో పాటు, ముదిరాజ్ జాతిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ముదిరాజ్ సంఘం జిల్లా యువజన నాయకుడు కొండ రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ముదిరాజుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఆయనతో పాటు ముదిరాజు సంఘం నాయకులు నరేష్, నాగరాజు, అజిత్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పలకలు, నోట్‌పుస్తకాల పంపిణీ



పలకలు, నోట్‌పుస్తకాలు అందిస్తున్న హరికృష్ణ

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని కందగట్ల ఆవాసం భజనతండా ప్రాథమిక పాఠశాలలో కంట్రోల్ రూమ్ ఎస్ఐ హరికృష్ణ కుమార్తె నిహార్శిక అక్షరాభ్యాసం సందర్భంగా శనివారం ఆ పాఠశాల విద్యార్థులకు రూ.10000 విలువ చేస్తే పలకలు, నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరికృష్ణ మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడపర్తి శ్రీనివాస్‌నాయుడు, అంగన్‌వాడీ టీచర్ సైదమ్మ, బిచ్చం తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్



అడివెంలలో టీబీ రోగులకు మద్దతు తెలుపుతున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : అడివెంలలోని ప్రాథమిక పాఠశాలలో వైద్యసిబ్బంది శనివారం ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టీబీ రోగులను మనలో ఒకరిగా చూడాలని కోరారు. ప్రతి నెల 24వ తేదీన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టీబీ రోగులకు ప్రతినెలా పోషణ నిమిత్తం ప్రభుత్వం రూ.500 చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారి జి.వాణి, సిబ్బంది వై.దుర్గమ్మ, బి.ప్రసాద్, హెచ్ఎం టి. కరుణాకర్, ఆశా కార్యకర్తలు టి.స్రవంతి, ఎ.పుష్ప, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.సరోజ, ఎస్.కళమ్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జగదీషన్న కప్ క్రీడలు



రామ్లతండాలో క్రీడాకారులు, నాయకులతో మంత్రి జగదీష్‌రెడ్డి తనయుడు వేమన్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చేపట్టిన జగదీషన్న కప్ క్రీడాపోటీలు శనివారం రెండో రోజు ముమ్మరంగా కొనసాగాయి. మండల పరిధిలోని రామ్లతండా, లక్ష్మీతండాల్లో జరుగుతున్న క్రీడలను మంత్రి జగదీష్‌రెడ్డి తనయుడు గుంటకండ్ల వేమన్‌రెడ్డి తిలకించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగదీష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బసిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, సర్పంచ్‌లు వాంకుడోతు స్వప్ననాగరాజు, సూర్యనాయక్, బీఆర్ఎస్ నాయకులు సేవనాయక్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో బిజీ..



తిరుమలగిరి : తిరుమలగిరి మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు పత్తి విత్తనాలు భారీగా నాటారు. చిరు జల్లులతో కూడిన వర్షం కురియడంతో విత్తనాలకు అనువైన సమయమని రైతులు అంటున్నారు.

పనుల్లో నిర్లక్ష్యం.. రోడ్డుపైనే నీళ్లు!



రోడ్డుకు ఎత్తులో డ్రైయినేజీకి ఏర్పాటు చేసిన రంధ్రాలు

దురాజ్‌పల్లి : సూర్యాపేట పట్టణంలోని పీఎస్ఆర్ సెంటర్ నుంచి ఎస్వీ కళాశాల వరకు రోడ్డు విస్తరణలో భాగంగా గతంలో ఉన్న డ్రెయినేజీలను తొలగించి రోడ్డుకు ఇరువైపులా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీని ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాల్సిన ఈ డ్రెయినేజీల నిర్మాణంలో ఇంజనీర్లు, కాంట్రాక్టర్‌లు నిర్లక్ష్యం ప్రదర్శించారు. రోడ్ల వెడల్పు సమయంలో ముందుగా రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలను ఏర్పాటు చేశారు. రోడ్డుపై నీళ్ల నిల్వకుండా డ్రెయినేజీలోకి వెళ్లేలా రంధ్రాలను ఏర్పాటు చేశారు. ఆ తరువాత రోడ్డును డ్రెయినేజీకి ఏర్పాటు చేసిన రంధ్రాలకు సమాంతరంగా వేయాల్సి ఉంటుంది. కానీ రోడ్డు వేసే సమయంలో ఇదేమీ పట్టించుకోలేదు. కొన్ని ప్రదేశాల్లో డ్రెయినేజీకి ఏర్పాటు చేసిన రంధ్రాలు రోడ్డుకు అర ఫీటు నుంచి 2 ఫీట్ల ఎత్తులో ఉన్నాయి. మరికొన్ని చోట్ల పూర్తిగా రోడ్డులో పూడిపోయాయి. దీంతో భారీగా వర్షాలు కురిస్తే రోడ్లపై నీళ్లు నిలిచే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

30లోగా పన్నులు చెల్లించాలి

తిరుమలగిరి : 2023–24 మొదటి ఆర్థిక సంవత్సరానికి గానూ తిరుమలగిరి మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తిపన్నులను వడ్డీ లేకుండా చెల్లించడానికి ఈ నెల 30వ తేదీ చివరి గడువు అని మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూలై 1 నుంచి బకాయి పన్నుపై నూటికి రూ.2 చొప్పున వడ్డీ పడుతుందని చెప్పారు.

‘కిట్స్’ విద్యార్థులకు టాస్క్ శిక్షణ తరగతులు

కోదాడఅర్బన్ : పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ నైపుణ్య విజ్ఞాన సంస్థ (టాస్క్) ఆధ్వర్యంలో బీటెక్ సీఎస్‌సీ, సివిల్ రెండో సంవత్సరం విద్యార్థినులకు శనివారం పైథాన్ ప్రోగ్రాంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల అకడమిక్ అడ్వైజర్ పోతుగంటి నాగేశ్వరరావు తెలిపారు. టాస్క్ సాంకేతిక నిపుణుడు వి.రాకేష్ శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.నాగార్జునరావు, వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం



ఈటూరులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

నాగారం : గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో సీఆర్ఐఎఫ్ నిధులు రూ.4 కోట్ల వ్యయంతో ఈటూరు నుంచి ఫణిగిరి స్టేజీ వరకు నూతన రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం అన్ని రకాల వసతులను కల్పించిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అని అన్నారు. గత పాలకుల హయాంలో తుంగతుర్తి నియోజకవర్గం పూర్తిగా వివక్షకు గురై, అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందని అన్నారు. గత తొమ్మిదేళ్లలో తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ మంత్రి పర్సనల్ సెక్రటరీ గద్దం ముకుందరెడ్డి, వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, ఆర్అండ్‌బీ డీఈఈ యుగంధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ గుండగాని అంబయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యారాల రాంరెడ్డి, సర్పంచ్ పేరాల సరిత యాదగిరి, తిరుమలగిరి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, పొదిల రమేష్, చిల్లర చంద్రమౌళి, దోమల బాలమల్లు, ఈరేటి అంజయ్య, నరసింహారెడ్డి, గోడిశాల యాదగిరి, శ్రీను, రమేష్, కార్యదర్శి భవాని, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి



తుంగతుర్తి : కర్విరాలలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు కటకం వెంకటేశ్వర్లు

తుంగతుర్తి : తిరుమలగిరి మండల కేంద్రంలో ఈ నెల 27న జరిగే నియోజకవర్గ ప్రగతి నివేదిక సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కటకం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కర్విరాలలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సభలో మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి పాల్గొంటారని అన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ వెలుగు వెంకన్న, నాయకులు భాస్కర్, సైదులు, నరేష్, కర్ణాకర్, సురేందర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : తిరుమలగిరిలో ఈ నెల 27వ తేదీన జరిగే ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు పొట్టి పాక సైదులు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సభకు రాష్ట్ర మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని చెప్పారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తుల పరిశీలన ముమ్మరం

- జాజిరెడ్డిగూడెం మండలంలో రూ.లక్ష సాయానికి 796 దరఖాస్తులు
- పరిశీలన అనంతరం దరఖాస్తులను జిల్లా బీసీ సంక్షేమ శాఖకు పంపనున్న మండల అధికారులు



అర్వపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు అందజేస్తున్న లబ్ధిదారుడు

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కుల వృత్తుల వారి అభివృద్ధికి రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మండలంలో భారీగానే దరఖాస్తులు చేశారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి కుల, ఆదాయ ధ్రువపత్రాలు జతచేసి ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని అధికారులు సూచించారు. కానీ ఈ ధ్రువపత్రాలు పొందడానికి సర్వర్ మొరాయించడంతో చాలా మంది అవకాశం కోల్పోయారు. మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీల పరిధిలో 15 బీసీ ఉపకులాలకు చెందిన 796 మంది ఈనెల 6 నుంచి 20 వరకు దరఖాస్తు చేశారు.

నేటి వరకు పరిశీలన..

జాజిరెడ్డిగూడెం మండలంలో రూ.లక్ష సాయం కోసం 796 మంది దరఖాస్తులు చేసుకోగా జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం మండల అధికారులు దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. అయితే దరఖాస్తుదారులు కొందరు ఆన్‌లైన్ చేశాక తమ దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించారు. మరికొందరు కేవలం ఆన్‌లైన్‌మాత్రమే చేసుకున్నారు. అయితే ఆన్‌లైన్‌లో చేసుకున్న వారి జాబితా ప్రకారం మండల పరిషత్ అధికారులు ధ్రువపత్రాలను దరఖాస్తుదారుడి వారీగా పరిశీలిస్తున్నారు. నేటి వరకు వీటిని పరిశీలించి రేపు జిల్లా బీసీ సంక్షేమ శాఖకు పంపనున్నారు.

దరఖాస్తు చేసుకున్నా..



రూ.లక్ష సాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాను. ఈ సాయం అందితే యూనిట్‌కు ఉపయోగపడే పరికరాలను తెచ్చుకొని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటా. ఈ సాయం అందించడం కులవృత్తుల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– వేణు, దరఖాస్తుదారుడు, అర్వపల్లి

దరఖాస్తుల పరిశీలన జరుగుతుంది



కులవృత్తుల అభివృద్ధికి రూ.లక్ష సాయం అందించే పథకానికి మండలంలో 796 మంది దరఖాస్తులు చేశారు. ఈ దరఖాస్తుల పరిశీలనను చేపట్టాం. నేడు దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి రేపు జిల్లా బీసీ సంక్షేమ శాఖకు సమర్పిస్తాం. అన్ని సర్టిఫికెట్లను పరిశీలించడం జరుగుతుంది.

– కతురోజు ఉమేష్, ఎంపీడీఓ

మృతులకు నివాళి

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన పాల్వాయి రవికుమార్ కుమార్ కుమార్తె పాల్వాయి రేణుక (18) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా స్థానిక వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల శనివారం మృతురాలి భౌతిక కాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చిప్పలపల్లి సోమయ్య, ఎలుక సైదులు, మురళి, చిప్పలపల్లి మల్లేష్, రాములు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని కుంటపల్లి గ్రామానికి చెందిన గుండ్ల మహేష్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సంకినేని వరుణ్‌రావు శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాగర్, నాయకులు బొమ్మెర నరేష్, బింగి దశపతి, ఉపేందర్, శిలివేరు సతీష్, శ్రావణ్, విజయ్, ధోని, వెంకన్న, చిరంజీవి, వేణు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మునగాల : జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు బండి సతీష్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కిసాన్ సంఘ్ జిల్లా సమావేశంలో మాట్లాడారు. విద్యుత్, రెవెన్యూ, ధరణి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. జనవరిలో జరిగే సభ్యత్వ అభియాన్‌లో 20 వేల మంది రైతులను సభ్యులుగా చేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి, రాష్ట్ర సేంద్రియ వ్యవసాయ అధ్యక్షుడు అర్వపలి వీరభద్రరావు, జిల్లా కార్యదర్శి అబ్బిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెన్‌పహాడ్ : సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ యాదగిరి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ నంబర్లను లిఫ్ట్ చేయకూడదని, బ్యాంకు, ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లను పరిచయం లేని వ్యక్తులకు ఇవ్వకూడదని సూచించారు. సైబర్ నేరాల నిర్మూలన కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై పెన్‌పహాడ్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది